మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


## తొమ్మిదేళ్ల ప్రగతి ప్రస్థానం.. జిల్లా ఘన కీర్తిని చాటేలా...

# తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

● రాష్ట్ర ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 31 ప్రభాతవార్త:** తొమ్మిదేళ్ల నాగర్‌కర్నూల్ జిల్లా ప్రగతి ప్రస్థానాన్ని యావత్ ప్రజానీకానికి తెలియజేస్తూ తొమ్మిదేళ్లలో రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాలతో తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు మరోసారి గుర్తు చేస్తూ స్వరాష్ట్రం కోసం తెలంగాణ అమరవీరులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను అట్టహాసంగా అంగరంగావైభవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, అచ్చంపేట గువ్వల బాలరాజు అన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవం, దశాబ్ది ఉత్సవాలపై బుధవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల, జిల్లా స్థాయి అధికారులతో అవగాహన సమావేశాన్ని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, అచ్చంపేట గువ్వల బాలరాజు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శాంత కుమారి, కొల్లాపూర్ శాసన సభ్యులు బీరం హర్షవర్ధన్‌రెడ్డిలు హజరై దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. జూన్ 2 నుంచి 21 రోజుల పాటు జరగనున్న ఈ వేడుకల్లో రోజుకో శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ కార్యక్రమాలను అన్ని నియోజకవర్గ స్థాయిలో ఘనంగా నిర్వహించేందుకు ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేకాధికారిని నియమిచాలని సమావేశంలో నిర్ణయించారు. ఘనమైన చరిత్ర ఉన్న నాగర్‌కర్నూల్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్, డాక్టర్ గువ్వల బాలరాజు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు ఘనమైన కీర్తి ఉందని, పరిపాలన అద్భుతంగా సాగుతుందని, అనేక విజయాలను సాధించామని, ఇది ప్రజా ప్రతినిధులు, అధికా రుల సమిష్టి కృషితో సాధ్యమైనదన్నారు. ఆంధ్రుల పాలనలో ఒకనాడు గంజి కేంద్రాలు నడిచిన జిల్లాలో ఇయ్యాల స్వరాష్ట్ర పాలనలో పచ్చని పంటలు పారే వాగులతో పాలు గారే పరిస్థితి జిల్లాలో నేడుఉందన్నారు. నాటి నేటి పరిస్థితులను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను విజయవంతం చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేసి ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని అధికారులు, ఉద్యోగులు పూర్తి స్థాయిలో భాగస్వామ్యమై విజయవంతం చేయాలని ఆయన కోరారు. తెలంగాణ ఏర్పాటుతో గ్రామాల్లో మారిన రూపురేఖలను ప్రజలకు వివరించాలని జెడ్పీ చైర్మన్ శాంతకుమారి అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఒక్కో రోజుఒక్కో కార్యక్రమం కొనసాగుతుం దన్నారు. ప్రతి నియోజకవర్గంలో 2014కు పూర్వం, 2023 నాటికి సాధించిన ప్రగతిని ప్రజల కు తెలియజేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు సమావేశమై వేడుకలను పెద్దఎత్తున ఘనంగా నిర్వహించే కార్యక్రమాలను కార్యచరణ చేసి ప్రజా ప్రతినిధులకు ముందస్తుగానే తెలుపాలన్నారు. తెలంగాణ సాధనకు చేపట్టిన స్ఫూర్తిని, సాధించిన తెలంగాణ అభివృద్ధిని ప్రజలకు గొప్పగా వివరించాలని, వేడుకలను అట్టహాసంగా నిర్వ హించాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ కె.మనోహర్ మాట్లాడుతూ సురక్షా దినోత్సవం రోజు ర్యాలీని కూడా ఏర్పాటు చేస్తామని, షీటీం, భరోస, సైబర్ నేరాలు, తెలంగాణ పోలీసుల ప్రతిభ గురించి ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్.మోతిలాల్, జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడి, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



సమావేశానికి హాజరైన అన్ని శాఖల జిల్లా అధికారులు

# 8న జడ్చర్లకు మంత్రి కేటీఆర్

◆ జడ్చర్ల ఎర్రగుట్ట వద్ద డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాల పంపిణీ ◆ వెల్లడించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే31, ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుట్టవద్ద పేదల సొంతింటి కలను నిజం చేస్తూ నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను అర్హులకు అందజేసేందుకు ఈ నెల 8న మంత్రి కేటీఆర్ జడ్చర్లకు రానున్నట్లు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక నాయకులు, అధికారులతో ఎర్రగుట్ట వద్ద డబుల్ బెడ్రూం ఇండ్లను ఎమ్మెల్యే సందర్శించారు. చివరి దశలో ఉన్న పనులను పరిశీలించి కాంట్రాక్టర్లకు పలు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడు లేని ప్రతి నిరుపేదలకు ఇల్లు అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదన్నారు. విడుదల వారీగా అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. త్వరితగతిన చివరి దశ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ జంగయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మీరవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ మన్నెం గోవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ డానిష్, మున్సిపల్ కమిషనర్ మహెమూద్‌షేక్, కౌన్సిలర్ నవనీతకొండల్, నాయ కులు దోరెపల్లిరవీందర్, నాగిరెడ్డి, రామ్మోహన్, సూరి ఉన్నారు.

**గౌస్ పార్థివ దేహానికి నివాళి:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని నిమ్మబావి గడ్డకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్త, ఫొటో గ్రాఫర్ మహెమూద్ గౌస్‌కు మంగళవారం రాత్రి అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బుధవారం జడ్చర్లలోనిగౌస్ ఇంటికి చేరుకొని పార్థివదేహానికి నివా ళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసానిచ్చారు.



## జూన్ 3న రైతు దినోత్సవ వేడుకలు

# అట్టహాసంగా నిర్వహించాలి

■ ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, డప్పులతో భారీ ర్యాలీతో పాల్గొనాలి

■ వనపర్తి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



నాగవరం తండా రైతు వేదికలో జరిగే ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి ప్రతినిధి, మే31, ప్రభాతవార్త:** తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జూన్ 3న రైతు దినోత్సవం వేడుకలు జిల్లాలో అట్టహాసంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం ఉదయం నాగవరం తాండ రైతు వేదికలో రైతు దినోత్సవ సంబరాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. నాగవరం తాండ రైతు వేదికలో జరిగే ఉత్సవాలకు క్లస్టర్ నుండి 5వేల మంది రైతులకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉత్సవాలకు వచ్చే రైతులు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్‌లలో, నడుచుకుంటు డప్పు, బ్యాండ్‌లతో వచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. రైతులకు కూర్చోవడానికి చలువ నీడ, తాగు నీరు, భోజనాలు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. రైతు వేదికను అందంగా అలంకరించాలని, ఎడ్ల బండితో వచ్చే వారికి ఎడ్లకు తాగునీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. వేదిక ఏర్పాట్లు, అలంకరణ ఏర్పాట్లు, భోజనాలు తదితర అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, ఆర్డీవో పద్మావతి, వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్, జిల్లా ఉద్యానవన అధికారి సురేష్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, కో ఆపరేటివ్ అధికారిని కాలిక్రాంతి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అన్ని విధాల కృషి చేస్తా

-ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్‌ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



**వెల్దండ, మే 31 ప్రభాతవార్త:** నియోజకవర్గ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అన్ని విధాల కృషి చేస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్‌ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. వెల్దండ మండల పరిధిలోని ఎంజీ తాండలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్‌ఆర్ఐ సుంకిరెడ్డిరాఘవేందర్‌రెడ్డి రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రాన్ని చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల్లో సమూలమైన మార్పులు రావాలని, మార్పు తెచ్చే విధంగా ఐక్యత ఫౌండేషన్ ఎల్లవేళాల కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గ పరిధిలో విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల్లో వెనుకబడి ఉన్నారని, ఇప్పటికైన మనం మేల్కొకపోతే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని, ప్రతి ఒక్కరి అభివృద్ధి సంక్షేమం, ధ్యేయంగా అన్ని విధాల కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రఘునాయక్, రేఖ్యానాయక్, దేశ్యనాయక్, శ్రీనునాయక్, లక్ష్మణ్ తో పాటు ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

## పొగాకుకు దూరంగా ఉండడమే ఆరోగ్యవంతమైన జీవితం

- జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామచంద్రరావు



**వనపర్తి వైద్యవిభాగం, మే31, ప్రభాతవార్త:** ప్రతి వ్యక్తి పౌష్టికాహారం తీసుకుని పొగాకుకు దూరంగా ఉండడమే ఆరోగ్యవంతమైన జీవితం అనిఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామచంద్రారావు అన్నారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతి రేక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పొగాకు ఉత్పత్తులను ఏరకంగా సేవించిన అది అత్యంత ప్రమా దకరమని, పొగాకు వాడకం క్యాన్సర్ కారకం అని అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం ప్రకారం బహిరంగ ప్రదేశంలో ధూమపానం చేయడం నిషిద్ధమని తెలిపారు. పాఠశాలలు విద్యా సంస్థలు ప్రార్ధన మందిరాలకు 100 గజాల దూరంలో పొగాకు ఉత్పత్తుల అమ్మకంపై పూర్తిస్థాయి నిషేధం ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, డాక్టర్ పరిమళ, మణెమ్మ, సుచిత్ర, సాయిరెడ్డి, మహేష్, అశోక్, జిల్లాలోని ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో వానాకాలం పంటల ప్రణాళిక ఖరారు..!

▸▸ వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రయత్నం

▸▸ జిల్లా వ్యాప్తంగా 3,77,917 ఎకరాలలో అన్నిరకాల పంటలు సాగు

▸▸ ఎక్కువగా వరి పంట, తక్కువగా చెరుకు

▸▸ రసాయనిక ఎరువుల ప్రణాళిక కూడ ఖరారు

▸▸ జులై 15లోగా నాట్లు వేయించేలా ప్రణాళిక



ఓగులాయపల్లి వద్ద నాట్లు వేస్తున్న కూలీలు (ఫైల్)

**దేవరకద్ర, మే 31, త ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లాలో 2023-24 వానాకాలంలో వాతావరణ పరిస్థితులను ఎదుర్కోనేలా వానాకాలం పంటల ప్రణాళికను సంబందిత అధికారులు ఖరారు చేశారు. అలాగే వాటికి తగ్గట్లు రసాయనిక ఎరువుల ప్రణాళిక కూడ అధికారులు ఖరారు చేశారు. జిల్లాలో నేలస్వభావాన్ని బట్టి ఏయే పంటలు ఏ మేరకు సాగవుతావోనని కూడ అంచనా వేశారు. అయితే ఈ వర్షాకాలం పంటలలో పత్తి, కంది, మొక్కజొన్న, జొన్న, చిరుధాన్యాల సాగు విస్తీర్ణ్యం పెరుగనుందని అంచనా వేశారు. పంటల సాగు విస్తీర్ణ్యంతో పాటు అవసరమయ్యే విత్తనాలు, ఎరువుల కూడ ప్రణాళికను వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేశారు. ప్రతి ఏడాది వడగండ్ల వాన కురిసి పంటలకు పెద్ద మొత్తంలో పంట నష్టం జరుగుతుంది. ఈ క్రమంలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా నాట్లువేయించి, ముందస్తుగా కోతలు కోయించేలా అదికారులు కృషి చేస్తున్నారు. ఈ సీజన్ నుండే ఈ నిర్ణయాన్ని అమలుచేసేలా తగు చర్యలు తీసుకొంటున్నారు. ఈ విషయంలో రైతులకు అవగాహన కల్పించడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ దిశగా మండల వ్యవసాధికారులు, విస్తరణాధికారులు రైతులకు అవగాహన కల్పించడానికి కృషి చేస్తున్నారు. సాధారణంగా ప్రతి ఏడాది వానాకాలంలో వరినాట్లను జులైలో ప్రారంభించి సెప్టెంబరు వరకు వేస్తారు. దీంతో వానాకాలం కోతలు అలస్యమై యాసంగి పై ప్రభావం చూపుతుంది. దీని వల్ల యాసంగి కోతలు మే నెల వరకు జరుగుతాయి. దీంతో వరి పంట పొట్టదశలో ఉన్నప్పుడు మార్చి, ఎప్రిల్ నెలలో వడగండ్లు పడి తీవ్ర పంట నష్టం జరుగుతుంది. దీనికి అధిగమించేందుకు ముందస్తుగా నాట్లు వేయించాలలని అధికారులు భావిస్తున్నారు. అందుకే జూన్ 15లోగా నారుపోసుకొని, జులై 15లోగా నాట్లు పూర్తి చేసేలా అధికారులు చూస్తున్నారు. అలాగేయాసంగిలో నవంబరు 15లోగా నారు పోసుకొని డిసెంబరు 15లోపునాట్లు వేసేలాప్రయత్నిస్తున్నారు. ఈ విషయంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలను సైతం జారి చేసింది.



కరిగేట చేస్తున్న రైతు(ఫైల్)

**3,77,917 ఎకరాలలో అన్నిరకాల పంటలు సాగు అంచనా :** జిల్లా వ్యాప్తంగా ఈ వర్షాకాలంలో 3,77,917 ఎకరాలలో అన్నిరకాల పంటలు సాగు చేస్తారని వ్యవయాధికారులు అంచనా వేశారు. ఇందులో దాదాపు 1,89,917 ఎకరాలలో వరి పంటను సాగు చేస్తారని అంచనా వేశారు. అలాగే పత్తి 1,15,845 ఎకరాలు, మొక్కజొన్న 28,546 ఎకరాలు, జొన్న 13,015, కంది 12,548, ఆముదం 1,565, రాగులు 855, పెసర 195, మినుములు 65, ఉలవలు 81, వేరుశెనగ 69, చెరుకు 61, ఇతర పంటలు 405, కూరగాయల తోటలు 14,750 ఎకరాల చొప్పున సాగు చేస్తారని అంచనా వేశారు.

**రసాయనిక ఎరువుల ప్రణాళిక :** జిల్లా వ్యాప్తంగా రసాయనిక ఎరువుల ప్రణాళికను అధికారులు ఖరారు చేశారు. 32,990.0మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని అంచనా వేశారు. అలాగే డీఏపి 18,358, యంఒపి 9,164.0, కాంప్లెక్స్ 27,492, ఎస్ఎస్‌పి 7,331.2 మెట్రిక్ టన్నుల చొప్పున అవసరమవుతుందని ప్రణాళిక వేశారు.

## తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను

# అంగరంగ వైభవంగా నిర్వహించాలి

- రాష్ట్రం ఏర్పడ్డాక వ్యవసాయ రంగంలో సాధించిన ప్రగతి గురించి రైతులకు వివరించాలి : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



**వనపర్తి ప్రతినిధి, మే31, ప్రభాతవార్త:** తెలంగాణ దశాబ్ది ఉతనసవాల్లో భాగంగా జూన్ 3వ తేదీన జరిగే రైతు దినోత్సవం వేడుకలు జిల్లాలో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం నాగవరం తాండ రైతు వేదిక దగ్గర ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి పర్యవేక్షించారు. రైతు వేదికలో రైతు దినోత్సవ సంబరాలపై అధికా రులతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ ఏర్పడ్డాక వ్యవసాయ రంగంలో సాధించిన ప్రగతిని విశ్లేషించి పంట కాలాన్ని ఒక రోజు ముందుకు జరపడంపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమం రైతు దినోత్సవం రోజు ఉంటుందన్నారు. ఒకప్పుడు తెలంగాణ రైతులు బీడుపారి మన ప్రాంతం గుండానే కృష్ణా గోదావరి పారుతూ తెలంగాణ ప్రాంతానికి సాగు, తాగునీరు దొరికేది కాదన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించాక ప్రశ్నించే గొంతుకలకు తాళం వేస్తు కల్వకుర్తి లిఫ్ట్, కాళేశ్వరం, తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషనన వంటి ఎన్నో పనులు పూర్తి చేసుకుని తెలంగాణ రైతాంగానికి సాగునీరు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు ఇస్తున్నామన్నారు. త్వరలో పాల మూరు రంగారెడ్డి పూర్తి చేసి సస్యశ్యామలం కాబోతుందని ఇలాంటి విజయాలను గడిచిన తొమ్మిది సంవత్సరాల్లో సాధించి పదో సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను రైతు దినోత్సవ వేడుకల నుండే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఒకే రోజు అన్నిరైతు వేదికల్లో సంబురాలు ఘనంగా జరగాలని అధికారులను సూచిం చారు. 5వేల మంది రైతులకు సరిపడ అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉత్సవాలకు వచ్చే రైతులు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్‌లలో, నడుచుకుంటూ డప్పు, నృత్యాలతో ర్యాలీగా రానున్నట్లు తెలిపారు. రైతులకు కూర్చోవడానికి చలువ నీడ, తాగునీరు, భోజనాలు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. రైతు వేదికను అందంగా అలంకరించాలని మామిడి తోరణాలతో పండుగ వాతావరణం సృష్టించాలని సూచించారు. రాష్ట్ర గిడ్డం గుల శాఖ చైర్మన్ సాయి చందు, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి సురేష్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, కో ఆపరేటివ్ అధికారిని కాలి క్రాంతి తదితరులు మంత్రి వెంట ఉన్నారు.



నాగవరం రైతువేదికలో అధికారులకు సూచనలు ఇస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

# అచ్చంపేట ప్రజలకు కృతజ్ఞతలు: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

**అచ్చంపేట, మే31 ప్రభాతవార్త:** అచ్చంపేట నియోజకవర్గ ప్రజలు, రైతులు మంగళవారం అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమాలను విజయవంతం చేసినందుకు పేరు పేరున ధన్యవాదాలను అచ్చంపేట ఎమ్మెల్యే జీబీఆర్ తెలిపారు. బుధవారం నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యాధునికమైన వైద్య సదుపాయాలతో అచ్చంపేట నడిబొడ్డున 100 పడకల ఆసుపత్రిని నిర్మించడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో దేశ రాజకీయాల్లో కేసీఆర్ ముందడుగు వేస్తున్నారని, కోటి ఎకరాల మాగాణికి సాగునీరు అందించారని ఆయన పేర్కొన్నారు. కోట్లాది రూ॥లతో అచ్చంపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం ఎంతో సంతోషకరమన్నారు. నల్లమల్ల ప్రాంత ప్రజలకు సాగునీటి అవసరాల కోసం 2300 కోట్లతో ప్రజాఎక్టులను మంజూరు చేయడమైందని, ఈ ప్రాంత ప్రజలకు సాగు, తాగునీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. అచ్చంపేటలో నర్సింగ్, పాలిటెక్నిక్ కళా శాలలను ఏర్పాటు చేయాలని మంత్రి హరీష్‌రావును కోరడమైందని ఆయన గుర్తు చేశారు. ఈ నెల 6వ తేదీన నాగం కర్నూల్ జిల్లా కేంద్రానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రానున్న సందర్భంగా నిర్వహించే బహిరంగ సభను రూ.1 లక్ష మందితో నిర్వహిస్తామని, ఈ సభను విజయవంతం చేసేందుకు జిల్లా ప్రజలు సహకరించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహ్మాగౌడ్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్య క్షులు పోకల మనోహర్, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## పేదింటి ఆడబిడ్డ వివాహానికి చేయూత



సైదమ్మ తల్లికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డి

**ఊర్కొండ,మే 31 ప్రభాతవార్త:** ఊర్కొండ మండలం నర్సంపల్లి గ్రామానికి చెందిన పేదింటి ఆడబిడ్డ పులిమామిడి సైదమ్మ వివాహానికి జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా కబడ్డీ, కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డిలు చేయూతనందించారు. నర్సంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోలే లక్ష్మయ్య ద్వారా విషయం తెలు సుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రూ.10వేలు, నాగర్‌కర్నూల్ జిల్లా కబడ్డీ, కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డి రూ.11 వేలు సమకూర్చి బుధవారం సైదమ్మ తల్లికి అందించారు. ఈ సందర్భంగా ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. విషయం వివరించిన వెంటనే ఎమ్మెల్యే స్పందించి ఆర్థిక సహాయంఅందించడం ఆయన గొప్ప మనస్సుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నాయకులు పోలే అర్జునయ్య, కృష్ణ, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## సర్కారు సదువు సాగదు.. కార్పొరేట్ దోపిడీ ఆగదు!

**వనపర్తి పట్టణం, విద్యా విభాగం,మే31,ప్రభాతవార్త:** కొత్తగా విద్యా సంవత్సరం ప్రారంభంలో సర్కారు అట్టహాసంగా ఆర్భాటంగా ఎన్నో కార్యక్రమాలను చేపట్టి గ్రామీణ ప్రాంతాల్లోను పట్టణ ప్రాంతాల్లోను పిల్లలు సర్కారు బడుల్లో చదువుకునే విధంగా చర్యలు చేపడతారు. ఈ కార్యక్రమాలు గత దశాబ్దాల కాలం నుండి కొనసాగుతున్నాయి. కానీ మసక బారిన చదువులతో విద్యార్థుల ఫలితాలలో డొల్లతనం కనబడుతుంది. దీన్ని ఆసరాగా తీసుకుని కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల అమాయకత్వాన్ని విద్య పట్ల వారికున్న మక్కువను ఆసరాగా తీసుకుని అందిన కాడికి దోపిడి చేస్తు అక్షరానికి లక్షల్లో వసూలు చేస్తు అందరిని అయోమయంలో పడేస్తున్నారని వారిపై పర్యవేక్షణ కరువైందని చాలా మంది విద్యార్థులు మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కావునా ఈ ఇరువుని మధ్యల నలిగిపోకుండా అటు సర్కారు ఇటు కార్పోరేట్ కాకుండా తమకు అందుబాటులో ఉన్న మధ్య తరగతి, ప్రైవేటు, బడ్జెట్ పాఠశాలలో తమ పిల్లల్ని చేర్పిస్తే ఆయా పాఠశాలలో తమ యొక్క సందేహాలను సూచనలు ఇస్తు తమ పిల్లల భవిష్యత్తును దిద్దుకోవడానికి అవకాశం ఉంటుందని పలువురు విద్యావేత్తలు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా కాంగ్రెస్ నాయకుడు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్‌నాయకులు

**అమరచింత,మే31,ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుడు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీ మహంకాళి విష్ణు, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు జుబేర్ అహ్మద్ ఆధ్వర్యంలో కేకు కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు జరిపారు. అలాగే పట్టణంలో డీఎంఆర్ ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అయూబ్‌ఖాన్, మన్నన్, వెంకటస్వామి, శ్రీధర్, శ్రీను, సుధాకర్, కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**కెటిదొడ్డి, మే 31 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కెటిదొడ్డి మండల పరిధిలోని గువ్వలదిన్నె గ్రామానికి చెందిన బోయ కర్రప్ప అనారోగ్యంతో మృతి చెందారు. మృతి చెందిన విషయం తెలుసుకున్న వెంటనే బుధవారం గట్టు మండలం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు బాసు హనుమంతునాయుడు పార్థీవ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ అంత్యక్రియల కోసం ఐదువేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.

## ఎస్పీకి ఫిర్యాదు చేసిన ధరూర్ మాజీ సర్పంచ్



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**గద్వాల ప్రతినిధి,మే31 ప్రభాతవార్త:** మంగళవారం గద్వాల్ రెడ్‌చిల్లి హోటల్లో తమపై అకారణంగా మారణాయుధాలతో హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ధరూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ధరూర్ గ్రామ ప్రజలతో కలిసి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దాదాపు ముప్పై మందితో మాపై దాడికి పాల్పడ్డారని అలాగే వారికి ప్రోత్సాహంఅందించి మాపై హత్యాయత్నానికి ప్రేరేపించిననడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రంజిత్‌కుమార్‌పై కూడా చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

## పంజుగుల గ్రామాభివృద్ధికి కృషి

**-ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి**

**కల్వకుర్తి,మే 31 ప్రభాతవార్త:** పంజుగుల గ్రామాభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించి గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొని వైద్య ఖర్చులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు పై చదువులకు అండగా ఉంటానని, అనంతరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన మృతుల కుటుంబాలను పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గంలో చేపడుతున్న సేవాకార్యక్రమాలను గ్రామస్తులకు వివరించారు. విద్య, వైద్యం, ఉపాధి అనే నినాదంతో ముందుకు సాగుతున్నానని పేర్కొన్నారు. గ్రామంలో నెల కొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ అంజియాదవ్, మాజీ సర్పంచ్ పరుశరాములు, వార్డు సభ్యులు రాజు, మాలిక్, పర్వపాకుల రమేష్, రాములు, లక్ష్మణ్, వెంకటయ్య, శ్రీశైలం, ఆంజనేయులు, శ్రీను, చంద్రయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

## జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఆలయ నూతన ధర్మకర్తల మండలి సభ్యులు

**గద్వాల ప్రతినిధి,మే31 ప్రభాతవార్త:** బుధవారం శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, దేవాదాయ, ధర్మాదాయ శాఖసహాయ కమిషనర్, జి.శ్రీనివాసరాజు, ఆలయ ఈఓ ఆర్.పురెందర్ కుమార్, పర్యవేక్షణలో నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో నూతన ధర్మకర్తల మండలి సభ్యులు 14 మంది చిన్నకృష్ణయ్య, చంద్రకళ, వెంకటనారాయణరెడ్డి, రఘు ధనుంజయ్, బి. సత్యన్న, వెంకటేశ్వర్‌రెడ్డి, చాకలి వెంకటేశ్వర్లు, బి.అంపయ్య, గొల్లకేశన్న, అడివప్ప, కె. సత్యనారాయణ, కె.రమేష్‌బాబు, ఎం.సురేఖ, ఆలయ ముఖ్య అర్చకులు, ఎక్స్ అఫిషియో సభ్యులు డి.ఆనంద్‌శర్మ ఈ కోరంలో సభ్యులుగా ఉన్నారు. సభ్యులు సి.చంద్రకళ, కె.వెంకటేశ్వర్‌రెడ్డి, చైర్మన్‌గా బి. చిన్న కృష్ణయ్య పేరును ప్రతిపాదించగా సభ్యులందరు దీనికి ఆమోదం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి హాజంయ్యారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ అధికార ప్రతినిధి మందజగన్నాథం, జడ్పీ ఛైర్‌పర్సన్ సరితి తిరుపతయ్య, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనోరమ, వెంకటేష్, వైస్ ఛైర్మన్ శేఖర్‌రెడ్డి, ఎంపిపి బేగం గోకారి, జడ్పీటిసి శంషాద్ ఇస్మాయిల్, ఆలయ మాజీ ఛైర్మన్‌లు ధర్మకర్తలు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## దాడిని ఖండించిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు



దాడిని ఖండిస్తున్న నాయకులు

**గద్వాల ప్రతినిధి,మే31 ప్రభాతవార్త:** అధికార బిఆర్ఎస్ పార్టీ గుండాలు నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయంపై దాడి, ఇంటి దగ్గరికి వెళ్లి కారును ధ్వంసం చేసిన ఘటన మంగళవారం గద్వాలలో చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న బహుజన్ సమాజ్ పార్టీ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు ఎం.సి కేశవరావు, నడిగడ్డ హక్కుల పోరాట సమితి చైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్‌ని కలిసి వారి పార్టీ కార్యాలయం అలాగే వారి ఇంటిదగ్గర ధ్వంసమైన కారును పరిశీలించి డా.ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఫోన్‌చేసి మాట్లాడించారు. రంజిత్‌కుమార్‌కు మేము అండగా ఉన్నామని భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ ఎదుగుదల చూడలేక నడగడ్డ హక్కు పోరాట సమితి కార్యాలయంపై దాడి చేశారన్నారు. 70 ఏళ్ల నుండి నడిగడ్డను రావణకాష్టగా మార్చిఎన్నికల వేళమళ్లీ గుండాయిజం మొదలుపెట్టారన్నారు. నడిగడ్డలో గతకొన్ని సంవత్సరాలుగా బహుజన వాదంబలపడినందుకు బహుజనుల ఎదుగుదలను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేకనే ఎమ్మెల్యే క్రిష్ణమోహన్‌రెడ్డి అనుచరులతో దాడులు చేయిస్తున్నారన్నారు. ఇది కేవలం గొంగళ్ల రంజిత్‌కుమార్‌పై దాడిగా పరిగణించకూడదని ఇది ప్రతి బహుజనుడిపై దాడిగా పరిగణించాలన్నారు. అందుకే బహుజన్ సమాజ్ పార్టీ ప్రతి బహుజనుడు రాజకీయంగా ఎదగాలనే డా.ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కృషి చేస్తున్నారని తెలిపారు. బహుజనులపై ఎక్కడదారి జరిగిన బహుజ్ సమాజ్ పార్టీ వారికి అండగా నిలబడుతుందని వారు హామీ ఇచ్చారు. అక్కడ జోగులాంబ గద్వాలజిల్లా ఇంఛార్జి ఎంజి కృష్ణ, గద్వాల నియోజకవర్గ అధ్యక్షులు ఎస్. రాజు గద్వాల నియోజకవర్గ ఇంఛార్జి సీసాల వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు గోపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మణికుమార్ తదితరులు ఉన్నారు.

## మనిగిల్ల గ్రామం పెద్దదిక్కును కోల్పోయింది

**- మద్దిరాల రవీందర్‌రెడ్డి పేదల పక్షపాతి**
**- నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేసిన ఎంపీపీ మేఘారెడ్డి**



రవీందర్ రెడ్డి మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న ఎంపీపీ మేఘారెడ్డి

**పెద్దమందడి,మే31,ప్రభాతవార్త:** మండల పరిధిలోని మనిగిల్ల గ్రామానికి చెందిన గ్రామ పెద్ద మద్దిరాల రవీందర్‌రెడ్డి గుండెపోటుతో బుధవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందాడు. విషాద సంఘటనను తెలుసుకున్న పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి హుటాహుటిని మనిగిల్ల గ్రామానికి చేరుకుని మద్దిరాల రవీందర్‌రెడ్డి మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మనిగిల్ల గ్రామంలో చాలా కాలంగా పేదల పక్షపాతిగా సేవలందిస్తు వస్తున్న రవీందర్‌రెడ్డి మృతి మనిగిల్ల గ్రామస్థులకు తీరని లోటు అని ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఎంపీపీ వెంట పెద్దమందడి సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ఐనత్యారెడ్డి, సర్పంచ్ భర్త తిరుపతిరెడ్డి, నాయకులు రాఘవేందర్, అల్వాల శేఖర్‌రెడ్డి, టీఎంఆర్ యువసేన నాయకులు తిరుపతి యాదవ్, వాకిటి బాలరాజు, తదితరులు ఉన్నారు.

## మూడవరోజు కొనసాగిన నిరసన దీక్ష



దేవరకద్రలో నిరసనదీక్ష చేస్తున్న బాధిత లబ్ధిదారులు

**దేవరకద్ర,మే31 ప్రభాతవార్త:** దేవరకద్రలో స్థానిక శ్రీ ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్ భాధిత లబ్దిదారులు చేస్తున్న నిరసనదీక్ష మూడవరోజు బుధవారం కూడ కొనసాగింది. ఈ నిరసన దీక్షలను భాధిత లబ్దిదారులు ఈ నెల 28న ప్రారంభించారు. అయితే ఈ సమస్యను ఎవరు పట్టించుకోకపోవడంతో వారు మళ్ళీ నిరసనదీక్ష చేపట్టిన విషయం విధితమే. ఈ సందర్భంగా బాధిత లబ్దిదారులు ప్రసంగించారు. 2019లో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోనున్న శ్రీ ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవస్థానానికి సంబందించిన స్థలంలో 54 షాపులు నిర్మిస్తామని 54 కుటుంబాల వారితో ఒక్కొక్కరితో దాదాపు రూ.4లక్షల చొప్పున డిడిలు తీసుకున్నారన్నారు. అయితే ఇంతవరకు దాదాపు 4 ఏళ్ళు గడుస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులు పూర్తి చేయలేదని వారు ఆవేదన వ్యక్తపరిచారు. దీని గురించి ఎవరు కూడ పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, సంబందిత అధికారులు పట్టించుకొని వెంటనే మా సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులు పెద్ద ఎత్తున నినాదాలిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్ భాధిత లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పరపల్లిలో ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనం



ముదిరాజుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**జల్లాఘణపురం,మే31,ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఉప్పరిపల్లి గ్రామంలో బుధవారం ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనంను స్థానిక మండలంలోని అన్ని గ్రామాల ముదిరాజుల గ్రామ నాయకులు , సభ్యులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ముదిరాజుల సంఘం మండల అధ్యక్షుడు అనమోని కృష్ణయ్య తెలిపారు. ఘణపూర్ మండల పరిధిలోని ఉప్పరపల్లి ముదిరాజుల గ్రామ కమిటీ వేయడం జరిగింది. ఈ సందర్భంగా అనమోని కృష్ణయ్య మాట్లాడుతూ... నేడు ఘనపురం మండల కేంద్రంలో, ఉప్పరిపల్లి గ్రామంలో ముదిరాజుల గ్రామ కమిటీలు వేయడం జరిగింది. ముదిరాజుల అభ్యున్నతికై మా హక్కులకై పోరాడతామని, రాబోయే రోజుల్లో రాజకీ యాల్లో కూడా క్రియాశీలక పాత్ర వహిస్తామని అన్నారు. ఘణపురం మండల కేంద్రంలో ముదిరాజుల ముద్దుబిడ్డ పండుగల సాయన్న విగ్రహం ఏర్పాటు చేస్తామని అన్నారు. విగ్రహ ఏర్పాటుకు మండలంలోని అన్ని గ్రామాల ముదిరాజులు రాజకీయ నాయకులు మేధావులు అందరూ సహాయ సహకారాలుఅందిస్తారని కోరారు. ఈ కార్యక్రమంలో సాయిలు, శ్రీనివాసులు, రాంచందర్, గట్టుకాడిపల్లి సర్పంచ్‌సురేందర్ ముదిరాజ్, కమలొద్దిన్ పూర్ లక్ష్మణ్, గోపాల్, మధు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

**గద్వాల ప్రతినిధి,మే 31 ప్రభాతవార్త:** నిన్న జరిగినటువంటి నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయంపై దాడిచేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని కలెక్టర్ కార్యాలయం ముందర నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గొంగళ్ల రంజిత్‌కుమార్ ధర్నా చేపట్టారు.



## నూతన వధువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే బీరం



**చిన్నంబావి,మే31,ప్రభాతవార్త:** చిన్నంబావి మండల కేంద్రంలోని లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన విష్ణు నాయుడు ఆహ్వానం మేరకు వారి వివాహ వేడుకకు హాజరై విష్ణు నాయుడు, సోమేశ్వరి దంపతులను ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొప్పునూరు గ్రామానికి చెందిన మౌనిక, ఉదయ్‌ల వివాహం ఈనెల 21న జరుగగా బుధవారం వారి స్వగృహానికి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు జడ్పీటీసీ కేసరెడ్డి వెంకటరమణమ్మ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చిన్నారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, లక్ష్మీపల్లి శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నారాయణ ఉన్నారు.

## ఇండస్ట్రీయల్ జోన్‌ను రద్దు చేయడంపై మంత్రి నిరంజన్‌రెడ్డిని సన్మానించిన 11వ వార్డు సభ్యులు



మంత్రి నిరంజన్‌రెడ్డిని సన్మానిస్తున్న కాలనీవాసులు

**వనపర్తి ప్రతినిధి,మే31,ప్రభాతవార్త:** వనపర్తి పట్టణ పరిధిలోని 11వ వార్డు ప్రాంతం ఇండస్ట్రీయల్ జోన్‌గా ఉండడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బ్యాంకు రుణాలు రాకపోవడంతో పాటు కాలనీలో అభివృద్ధికి నోచుకోలేదు. గతంలోపలుమార్లు నాయకుల దృష్టికి తీసుకువెళ్లిన సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల కాలనీ ప్రజలు మంత్రిని కలిసి వివరించడంతో ప్రభుత్వంతో చర్చించి ఇటీవల కాలనీ ప్రజలు మంత్రిని కలిసి వివరించడంతో ప్రభుత్వంతో చర్చించి ఇటీవల జరిగిన మంత్రుల క్యాబినెట్ మీటింగ్‌లో చర్చించి ఇండస్ట్రీయల్ జోన్‌ను రెసిడెన్షియల్ జోన్‌గా మార్చుతూ జీవో 77ను విడుదల చేశారు. ఇందుకు హర్షం వ్యక్తం చేసిన వార్డు ప్రజలు మంగళవారం రాత్రి మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువాగజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, మార్కెట్ చైర్మన్ రమేష్‌గౌడ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పేదింటి పెళ్లి కూతురును ఆశీర్వదించిన ఎంపీపీ మేఘారెడ్డి



నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న ఎంపీపీ మేఘారెడ్డి

**పెద్దమందడి,మే31,ప్రభాతవార్త:** మండల పరిధిలోని మనిగిల్ల గ్రామానికి చెందిన సుంచరమోని వెంకటయ్య కూతురు వివాహ వేడుకలో ఎంపీపీ మేఘారెడ్డి పాల్గొనిపెళ్లి కుమార్తెను ఆశీర్వదించారు. నూతన వధువరులు సుఖశాంతులతో కలకాలం వర్ధిల్లాలని ఆయన దీవించారు. ఎంపీపీ వెంట మనిగిల్ల తిరుపతిరెడ్డి, కొములయ్య, కాసీంగారి రాజు, మందడి కొములయ్య, ఊదరి వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**కల్వకుర్తి,మే 31 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన రామకృష్ణ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి రామకృష్ణ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ఫౌండేషన్ చైర్మన్ సమకూర్చిన రూ.10వేల ఆర్థిక సహాయాన్ని గ్రామ మాజీ సర్పంచ్ వట్టెపు కృష్ణయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ బాలయ్యలతో కలిసి మాజీ మార్కెట్ డైరెక్టర్ నిజాముద్దీన్‌లు పరామర్శించి అందించారు. కార్యక్రమంలో నాయకులు లింగమయ్య, బాలరాజు, యాదయ్య, శ్రీశైలం, ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

## దేశం గర్వపడేలా దశాబ్ది ఉత్సవాలు : సర్పంచ్



**వెల్దండ, మే 31 ప్రభాతవార్త:** తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు పదేళ్ల ప్రగతిని చాటుతూ దేశం గర్వపడేలా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో 21 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో ప్రజలందరు భాగస్వాములు కావాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, కనివినీ ఎరుగని పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని, తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుందన్నారు. తెలంగాణ సాధనకు చేపట్టిన స్ఫూర్తిని, సాధించిన తెలంగాణ అభివృద్ధిని ప్రజలకు గొప్పగా వివరించాలని, వేడుకలను అట్టహాసంగా నిర్వహించాలన్నారు. తెలంగాణ ఏర్పాటుతో గ్రామాల్లో మారిన రూపురేఖలను ప్రజలకు వివరించాలన్నారు.

## ఆంజనేయ స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలి

- చికురుచెట్టు తండాలో ధ్వజస్థంభ వేడుకలో పాల్గొన్న ఎంపీపీ మేఘారెడ్డి





ధ్వజస్థంభ పూజలో పాల్గొన్న ఎంపీపీ మేఘారెడ్డి

**పెద్దమందడి,మే31,ప్రభాతవార్త:** శ్రీశ్రీశ్రీ ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి కోరారు. బుధవారం మండల పరిధిలోని చికురుచెట్టు తాండలో ఆంజనేయ స్వామి ఆలయం దగ్గర ఏర్పాటు చేసిన ధ్వజస్థంభ పూజా కార్యక్రమంలో ఎంపీపీ మేఘారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండలో గిరిజనులం దరూ కలిసిమెలిసి ఆయురారోగ్యాలతో ఉండాలని,ఆలయాల పండుగలను కలిసికట్టుగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఇటీవల టీఎంఆర్ యువజన సంఘం ఆధ్వర్యంలో చేరిన వైస్ఎంపీపీ రఘుప్రసాద్‌ను, మాజీ జడ్పీటీసీ రమేష్ గౌడ్‌ను ఎంపీపీ మేఘారెడ్డిశాలువాతో సన్మానించారు. ఎంపీ పీ వెంట స్థానిక సర్పంచ్ రాధాకృష్ణ నాయక్,ముందరితాండ సర్పంచ్ జయంతి శంకర్‌నాయక్, నాయకులు తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణరెడ్డి, తిరుపతి యాదవ్,మోహన్ నాయక్, తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ నేతలకు అమెరికాలో ఘనస్వాగతం



కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎన్ఆర్ఐలు

**మహబూబ్‌నగరన్ ప్రతినిధి, మే 31, ప్రభాతవార్త:** ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ 10 రోజుల అమెరికా పర్యటనలో భాగంగా ఆయనతో కలిసి కార్య క్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లిన టీపీసీసీ స్టార్ క్యాంపెయినర్, ఎంపీ కోమ టిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డికి అమెరికాలోని వాషింగ్టన్ ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలు,పార్టీ అభిమానులు,నాయకులు బొకేలతో స్వాగతం చెప్పారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన జీఎస్సార్



**కల్వకుర్తి,మే31 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన రామకృష్ణ ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని బుధవారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యుల ను ఓదార్చారు. కుటుంబానికి అన్ని వేళలా తోడుగా ఉంటానని భరోసా కల్పించి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. అదే విధంగా గ్రామానికి చెందిన రమేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకొని బాధితుడు రమేష్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు సర్పంచ్ దేశం సునిత వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ కడల సంతోష మల్లేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాలయ్య,వార్డు సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ కల్వకుర్తి మండల జనరల్ సెక్రటరి దొక్క లింగమయ్య, బీఆర్ఎస్ నాయకులు తాజుద్దీన్, వట్టెపు కిశోర్, బాలరాజు, విజయ్, పరుశరాం, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఎల్‌వోసి అందజేసిన మంత్రి



**చిన్నంబావి,మే31,ప్రభాతవార్త:** మండల పరిధిలోని తాటిపాముల గ్రామానికి చెందిన ఆడేం తిరుపతమ్మకు ఆరోగ్యం బాగా లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దృష్టికి తాటిపాముల గ్రామ సర్పంచ్ సత్యం యాదవ్, మంత్రి దృష్టికి తీసుకు వెళ్లగా మంత్రి తక్షణమే స్పందించి వారికి రూ.2లక్షల 50వేల ఎల్‌వోసిని బాధిత కుటుంబానికి మంగళవారం వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి చేతుల మీదుగా ఎల్‌వోసిని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టరన తేజస్ నంద లాల్ పవార్, జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, తాటిపాముల సర్పంచ్ ఆడెం సత్యనారాయణ యాదవ్, పెబ్బేరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెనుతిరిగిన గర్భిణీలు!

- స్కానింగ్ లేదనే సమాచారంతో అసహనంతో గర్భిణీ బంధువులు
- ఒక్క రేడియాలజిస్టు వైద్యుడు ఉండడంతో ఇబ్బందులు పడుతున్న వైద్యులు



ఆసుపత్రి సిబ్బందితో గొడవ పడుతున్న గర్భిణీల బంధువులు

**వనపర్తి వైద్య విభాగం,మే31, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో గర్భిణీలకు స్కానింగ్ ఇబ్బందులు తప్పడం లేదు. బుధవారం గర్భిణీలకు ఎంసీహెచ్‌లో స్కానింగ్ చేయాల్సి ఉండగా, ఉన్న ఒక్క రేడియాలజిస్టు వైద్యుడు సెలవులో ఉండడం వల్ల గర్భిణీలకు స్కానింగ్ చేయలేదు.దీంతో గర్భిణీ తరఫున బంధువులు ఆసుపత్రి వైద్యులు సిబ్బందిపై వాదనలకు దిగారు. స్కానింగ్ బంద్ ఉంటే తమకు ముందుగా సమాచారం ఇవ్వాలని, ఎలాంటి సమాచారం లేకుండా తిరిగి వెళ్లి తరువాత రమ్మని చెప్పడం ఎంత వరకు సమంజసం అని వైద్యులతో గొడవకు దిగారు. ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ బంగారయ్య వచ్చి గర్భిణీల బంధువులకు నచ్చజెప్పడంతో గొడవ సద్దుమణిగింది. బుధవారం చేయాల్సిన స్కానింగ్ శుక్రవారం చేస్తామని గర్భిణీల బంధువులకు వైద్యులు తెలిపారు.

## కొవ్వొత్తులతో నిరసన

**వనపర్తి టౌన్,మే31,ప్రభాతవార్త:** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మల్ల యోధులకు మద్దతుగా లక్ష్మి నరసింహ కాలనీలో నిరసన కార్యక్రమం సందర్భంగా ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి సాయిలీలా మాట్లాడుతూ... గత రెండు నెలల నుండి జరుగుతున్న ఢిల్లీ జంతర్‌మంతర్ రెజ్లర్లను కాపాడాలని వారి మీద జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. దేశంలో నరేంద్రమోడీ ప్రభుత్వం రాముడి పేరుతో అధికారంలోకి వచ్చిన రావణపాలన కొనసాగిస్తున్నారని అన్నారు. న్యాయమైన పోరాటాన్ని కొనసాగిస్తున్న మల్ల యోధులపై అణిచివేత ధోరణితో వ్యవహరిస్తున్నారే తప్ప బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ ఎంపీ పదవి నుండి తొలగించడం లేదు అరెస్టు చేయడం లేదని అన్నారు. మల్ల యోధులకు న్యాయం చేయాలని అచల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సుశీల , రంజావి, శోభ, పార్వతి, భవాని, దివ్య, నందిని తదితరులు పాల్గొన్నారు.




కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం

# దేశానికే అన్నంపెట్టే స్థాయికి తెలంగాణ

- 9ఏండ్లలో అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి..
- స్వరాష్ట్రంలో మెరుగైన ప్రజా జీవనవిధానం
- 70 ఏండ్లు పాలించిన పార్టీలు చేసిందేమిటీ?
- కోడ్గల్ పర్యటనలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి
- ఎంపీ మన్నెతో కలిసి రూ.10కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం



గిరిజన గురుకుల బాలికల పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి,ఎంపీ మన్నె

**మహబూబ్‌నగరన్ ప్రతినిధి, మే 31, ప్రభాతవార్త:** 9ఏండ్లలోతెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, దేశానికే అన్నం పెట్టే స్థాయికి ఎదిగిందని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని కోడ్గల్ గ్రామంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, గిరిజన సహకార కార్పొరేషన్ చైర్మన్ వాల్యానాయక్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మట్లాడుతూ గతంలో 70ఏండ్లు పాలించిన పాలకులు, ప్రభుత్వాలు ఏం చేశాయో చెప్పాలన్నారు. కనీసం తాగడానికి నీళ్లు ఇవ్వని దుస్థితి ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ వచ్చాక ఒక్క సారి జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించాలన్నారు. నేడు తెలంగాణ అమలు చేస్తున్న రైతుబంధు,రైతు బీమా, దళితబంధు లాంటి ఎన్నో పథకాలు ఇతర రాష్ట్రాలు ఆచరిస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి దూరదృష్టతోనే రాష్ట్రంలో గురుకులాల ద్వారా ప్రతి పేద విద్యార్థికి కార్పొరేట్ స్థాయి విద్య, ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ ద్వారా తాగు నీరు అందుతుందన్నారు. జడ్చర్ల పట్టణంలోని పురాతన బావులను ఆర్కియాలజీ టూరిజం శాఖద్వారా అభివృద్ధి చేస్తామని మంత్రి ప్రకటించారు.ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధిలో భాగంగా పౌష్టికాహారంతోపాటు , పాఠశాలలను అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దేందుకు మన ఊరు మన బడి పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తుందన్నారు. తెలంగాణ రాకముందు వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి ఎలా ఉందో ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు.అభివృద్ధి,సంక్షేమ పథకాలుజడ్చర్ల నియోజకవర్గంలో బ్రహ్మాండంగా అమలవుతున్నాయన్నారు.యాసంగిలో తెలంగాణ నుంచి 60శాతం పంటలు పండించడం జరుగుతుందన్నారు. పల్లెలు, పట్టణాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. తెలంగాణ రాకుముందు ఉన్నకరెంట్, నీళ్ల సమస్య ఇప్పుడు ఉందా ప్రజలు గమనించాలన్నారు.పని చేసే ప్రభుత్వానికే మద్దతు తెలుపాలని కోరారు. విద్యా,వైద్యం, వ్యవసాయం రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గతంలో నియోజకవర్గంలో 14 రెసిడెన్షియల్ పాఠశాలలు ఉండగా వాటన్నింటినీ అప్‌గ్రేడ్ చేశామన్నారు.అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుందన్నారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడక ముందు రాష్ట్రంలో 100 గురుకులాలు ఉంటే ప్రస్తుతం 1000 గురుకులాలు ఉన్నాయని, ఇది కాదా అభివృద్ధికి నిదర్శనం అనిఅన్నారు.సమావేశానికి జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య అధ్యక్షత వహించగా, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ వాల్యానాయక్ మాట్లాడారు. ఈసందర్భంగా మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీలు రూ.10 లక్షలతో సుందరీకరించిన బస్టాండ్ ప్రాంతాన్ని సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు. రూ.9లక్షల వ్యయంతో నిర్మించిన డా.బీఆర్.అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ప్రహరీని ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన ఊరు –మన బడి కింద రూ.70లక్షలతో చేపట్టిన వివిధ పనులను ప్రారంభించారు. రూ.5కోట్లతో నిర్మించనున్న గిరిజన రెసిడెన్షియల్ పాఠశాల కాంప్లెక్స్ భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు. అంతేకాక రూ.4కోట్ల 20లక్షలతో నిర్మించిన గిరిజన సంక్షేమ బాలికల సంక్షేమ గురుకులాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి, సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, డీఈవో రవీందర్,డీపీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఎంఈవో మంజులాదేవీ, పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మన్నెం గోవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ డానిష్, మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మీరవీందర్, బాలానగర్ జడ్పీటీసీ కల్యాణి, గ్రామ సర్పంచ్ మమత నవీన్‌రెడ్డి లింగంపేట సర్పంచ్ హైమావతి ఉన్నారు.

# సేవాభావంతో పాటు అభివృద్ధి దిశగా పయణం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే31 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఆర్యవైశ్యులు సేవాభావంతో ప్రతి సందర్భంలో ముందడుగు వేసి ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి మానవ సేవే... మాధవ సేవ అనే విధంగా కార్యక్రమాల్లో పాల్గొని తోటి వారికి ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎంపీ పోతుగంటి రాములు పేర్కొన్నారు. శ్రీశైల మల్లిఖార్జున స్వామి సన్నిధిలో ఆర్యవైశ్యులకు నిరంతర సేవలందించేందుకు నిర్మితమైన ఆర్యవైశ్య దివ్య సేవాధామం టీ.జి.లక్ష్మి వెంకటేష్ భవన్, శ్రీ మల్లిఖార్జున అన్నదానసత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో 3వ రోజు కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పోతుగంటి రాములు, శ్రీశైలం అన్నపూర్ణ సత్రాల అధ్యక్షులు శ్రీ వొగ్గు శ్రీనివాసులు, బిల్లకంటి రంగయ్యలు ముఖ్య అతిథులుగా హాజరై యజ్ఞ, హోమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆర్యవైశ్యకులంలో కూడా పేద వారు ఉన్నారని, వారిని అభివృద్ధి పర్చేందుకు ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ సాధన దిశగా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నో కులాల ప్రజలను అభివృద్ధి పర్చేందుకు కార్పొరేషన్లను ఏర్పాటు చేసిందని, కార్పొరేషన్ ద్వారా అందించే రుణాలతో ఎంతో మంది అభివృద్ధి చెందుతున్నారని, ఆర్యవైశ్యులు మాత్రం తమ సొంత పనులు చేసుకొని అభివృద్ధి దిశగా కొట్టుమిట్టాడుతూ ముందుకు సాగుతున్నారని, అలాంటి ఆర్యవైశ్యులను ఆదుకోవడానికి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. సమాజంలో ఎక్కడైన దైవ కార్యక్రమాలు, సామాజిక సేవలో ఆర్యవైశ్యులు ముందుండి కార్యక్రమాలను నిర్వహించి తమ వంతు సేవాభావాన్ని ప్రదర్శించి అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారని వారు తెలిపారు. ఆర్యవైశ్యులు సామాజిక సేవతో రాజకీయంగా అభివృద్ధి చెంది ఉన్నత పదవులను అవరోధించేందుకు కలిసి కట్టుగా ఏకతాటిపైకి రావాలని వారు పిలుపునిచ్చారు. ప్రారంభోత్సవ కార్యక్రమాలకు విచ్చేసిన అతిథు లను సన్మానించి మెమెంటోలను బహుకరించి పట్టు పంచెలను అందించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో శ్రీ సురేష్ శర్మ బృందం 161 మంది వేద పండితుల బృందంతోనిత్య పూజ, హోమ కార్యక్రమాలు కొన సాగుతున్నాయి.కార్యక్రమంలో శ్రీమల్లిఖార్జున అన్నదాన సత్ర సంఘం అధ్యక్షులు మిడిదిడ్డి శ్యాంసుందర్,ప్రధాన కార్యదర్శి బలుస శ్రీరాములు, డైరెక్టర్లు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సింగం విజయ్ గౌడ్, స్పెషల్ నాలెడ్జ్ పర్సన్ కుడుముల మనోహర్‌రెడ్డి, ఆర్య వైశ్య బంధు మిత్రులు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను సన్మానిస్తున్న దృశ్యం



ఎంపీ పోతుగంటి రాములును సన్మానిస్తున్న దృశ్యం

# రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో వైఎస్ఆర్‌టీపీ జెండా ఎగరడం ఖాయం

- వైయస్సార్ టీపీ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జీ భుజాల వెంకటేశ్వర్‌రెడ్డి



తెలంగాణ వైయస్సార్ టీపీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**వనపర్తి టౌన్,మే31,ప్రభాతవార్త:** ప్రజలను, నాయకులను అవసరాలకు వాడుకొని వదిలేయడమే బీఆర్ఎస్ పార్టీ నాయకులకు తెలుసని, ప్రజలు మాత్రం కృతజ్ఞతభావంతో ఉన్నారని అందుకు నిదర్శనం ప్రతి ఇంట్లో దివంగత నేత వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఫోటో ఉంటుందని వైయస్సార్ టీపీ వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జీ భుజాల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వైయస్సార్ టీపీ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... 30 ఏళ్ల నుండి వనపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యేలుగా పని చేసిన నాయకులు సైతం ప్రస్తుతం జరుగుతున్న భూ కుంభకోణాలు, అవినీతిపై నోరు మెదపడం లేదంటే వారికి వెన్నుదన్నుగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. అవినీతిపై ప్రతి నియోజకవర్గంలో నాయకులను ప్రశ్నిస్తు.. వారి అవినీతి చిట్టాను వివరిస్తు చర్చించడానికి ఎక్కడికైనా వస్తానని ధైర్యంగా మాట్లాడిన సత్తా కేవలం వైయస్సార్ టీపీ పార్టీకి మాత్రమే ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎన్నో సమావేశాల్లో రోడ్‌షోలలో షర్మిలమ్మ సవాల్ విసిరిన నిమ్మకు నీరెత్తినట్లుగా బీఆర్ఎస్ నాయకులు ఉన్నారే తప్ప ఎవరు కూడా ముందుకు వచ్చిన పాపాన పోలేదని ఆయన విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు బీఆర్ఎస్ నాయకుల అవినీతిని నిశితంగా పరిశీలిస్తున్నారని రానున్న కాలంలో వారే తగిన బుద్ధి చెబుతారని ఆయన జోష్యం చెప్పారు. స్థానికంగా ఉండే మాజీ ఎమ్మెల్యేలు ఎందుకు నోరు మెదపడం లేదని ఎక్కడో స్థానికేతరుడైన బీజేపీ ఎమ్మెల్యే వనపర్తిలో జరిగే అవినీతిపై స్పందించడం హాస్యాస్పదంగా ఉందని ఆయన అన్నారు.వైయస్సార్ టీపీ కార్యాచరణను త్వరలోనే ప్రకటించబోతుందని రాజకీయాల్లో ఏదైనా సాధ్యమవుతుందని కలిసి పని చేయాల్సి వస్తే కూడా అందరం కలిసి పని చేస్తామని ఆయన పేర్కొన్నారు. వైయస్సార్ తెలంగాణ పార్టీ వనపర్తి జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమ్మడి చాణిక్య వనపర్తి జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రాజశేఖర్, అసెంబ్లీ ఎన్నికల ఇంచార్జీ బొడ్డుపల్లి సతీష్ , జిల్లా యువత అధ్యక్షుడు పరమేష్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి ఎండి అన్వర్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు నందిమల్ల బాలరాజు, జిల్లా కార్యదర్శి అవినాష్, జిల్లా రైతు విభాగం అధ్యక్షులు లోకేష్, యూత్ టౌన్ ప్రెసిడెంట్ కోన ఆంజనేయులు, పెబ్బేరు పట్టణ అధ్యక్షులు వెంకటేష్‌గౌడ్, మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, పెబ్బేరు మండల ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, ప్రచార కార్యదర్శి మైదుకూరు మైనుద్దిన్, దుబాయ్ జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి సైకిల్ కురుమన్న,జిల్లా ఎస్ఎస్ఎల్ కార్యదర్శి నిరంజన్, ప్రచార కార్యదర్శి సందీప్, మండలయూత్ అధ్యక్షులు నాని ప్రతాప్ ప్రచార కార్యకర్తలు సభ్యులు శివ పానుగల్ యూత్ అధ్యక్షుడు రాము, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కోటీశ్వరుల పాలయింది

- తెలంగాణలో బహుజన రాజ్యం ఏర్పడడం ఖాయం
- బీఎస్పీ వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జీ చెన్నా రాములు ముదిరాజ్
- బహుజన్ సమాజ్ పార్టీ వనపర్తి మండల కమిటీ ఎన్నిక



**వనపర్తి టౌన్,మే31,ప్రభాతవార్త:** కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కోటీశ్వరుల పాలయిందని, తెలంగాణలో బహుజన రాజ్యం ఏర్పడడం ఖాయమని బీఎస్పీ వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జీ చెన్నా రాములు ముదిరాజ్ అన్నారు. బుధవారం వనపర్తి పట్టణంలోని న్యూ టౌన్ కాలనీలో బీఎస్పీ వనపర్తి అసెంబ్లీ ఇంచార్జ్ నాగనమోని చెన్న రాములు ముదిరాజ్ నివాస గృహంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చెన్నా రాములు ముదిరాజ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కొందరు కోటీశ్వరులైన దొరలు, రెడ్లు దోచుక తింటున్నారని, 90 శాతం పైగా ఉన్న బహుజనులకు బాధల తెలంగాణగా, అప్పుల తెలంగాణగా మారిందన్నారు. తెలంగాణ బహుజన రాజ్యం స్థాపించాలని డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అడుగుజాడల్లో పయనించి మహనీయుల ఆశయాలు సాధించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.అనంతరం మండల కమిటీ ఎన్నిక జరిగింది.అధ్యక్షులుగా దండు రాజు,ఉపాధ్యక్షులుగా మండ్ల బండలయ్య బోయ, ప్రధాన కార్యదర్శిగా గజరాజు, కార్యదర్శిగా ఎత్తం కురుమూర్తి, కోశాధికారిగా కొండా సుదర్శన్ శెట్టి, 10 మందితో మండల కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. అతిథులుగా జిల్లా ఉపాధ్యక్షులు చిరంజీవి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గడ్డంమహేష్, పాల్గొన్నారు.ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి బహుజన రమేష్ ఎన్నికలు నిర్వహించారు.

## ఉపాధిని రక్షించుకుందాం కూలీల్లారా కదిలిరండి



కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

**చిన్నంబావి,మే31,ప్రభాతవార్త:** చిన్నంబావి మండల కేంద్రంలోని మియాపూర్ గ్రామ ఉపాధి పని ప్రదేశంలో ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకుంటు ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకుందాం ఊరూరా కూలీలు జూన్ 5న వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరుగే ధర్నాకు కదిలిరావాలని పిలుపునిచ్చారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచే విధంగా కేంద్ర ప్రభుత్వం సంవత్సరం సంవత్సరానికి నిధులను తగ్గిస్తు మరో వైపు ఇటీవలే మరో ప్రమాదరకమైన నిర్ణయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం తీసుకున్నదని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద జాబు కార్డు పొందిన కుటుంబాలు ఈ ఆర్థిక సంవత్సరంలో కూలీకి వెళ్లకుంటే వారి యొక్క జాబు కార్డులను తొలగిస్తామని తొలకరి వర్షంలో పేదల మీద పిడుగు పడ్డట్లు బాంబు విసిరిందన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలో ఓట్లు వేయించుకుని గెలిచిన మెజార్టీ లోక్ సభ సభ్యులు, మంత్రులు, పేద ప్రజలు నివసిస్తున్న గ్రామాలకు కనీసం పలకరింపుకు వెళ్లలేదు అని, పనులు చేయలేదు అని, వారి జాబితాను తయారు చేసి వాళ్లను కూడా తొలగించగల శక్తి ఉన్నదా మీకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తు ఆఖరికి ఉపాధి పనిని ఎత్తివేయాలని కుట్రలు చేస్తున్నదని అన్నారు. దీన్ని వ్యతిరేకిస్తు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో జూన్ 5వ తేదీన వ్యవసాయ కూలీలు, కొత్త గ్రామ పంచాయతీలో ఉపాధి పనిలో సీనియర్ మేటీలుగా పని చేస్తున్న వారిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా తీసుకోవాలని, ప్రతి ఉపాధి కూలీకి రోజు కూలీ 600 ఇవ్వాలని అన్నారు. ప్రతి జాబు కార్డుకు 200 రోజులు పని దినాలు కల్పించాలని అన్నారు. ఈ ధర్నాకు ఊరు ఊరు ఉపాధి కూలీలు వందలాది మంది కదిలిరావాలని కూలీలను కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, వ్యాకాస జిల్లా నాయకులు శంకర్, కూలీలు పాల్గొన్నారు.

## స్వర్ణోత్సవ కలయిక



**మహబూబ్‌నగరన్ ప్రతినిధి, మే 31, ప్రభాతవార్త:** జడ్చర్ల మండల పరిధిలోని కోడ్గల్ జెడ్పీహెచ్ఎస్ 2001–02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం పూర్వసమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పాఠశాలను ఆధునీకరించడంతో సుందరంగా తయారు అయిందని పూర్వ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ గురువులను సన్మా నించారు. సర్పంచ్ మమత నవీన్‌రెడ్డి సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసుకున్నట్లు నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో అభ్యున్నతి సాధించిన విద్యార్థులను సన్మానించారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలవారి సమీక్ష



మాట్లాడుతున్న డాక్టర్ వంశీకృష్ణ

**వీపనగండ్ల,మే31,ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో నెలవారి సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఆరోగ్య ఉప కేంద్రాల వారీగా ప్రజల ఆరోగ్యపరంగా ఎలాంటిజాగ్రత్తలు తీసుకోవాలో, అదే విధంగా ఇంతకు ముందు నెలలో ప్రజల ఆరోగ్యం పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నాము అనే విషయం పై అవగాహన సదస్సు నిర్వహించారు. అదేవిధంగా సీజన్‌పరంగా వచ్చే అంటు వ్యాధుల గురించి, మిగతా వ్యాధుల గురించి వేసవి దృష్ట్యా ప్రజలకు ఓఆర్ఎస్ పంపిణీ గురించి అదే విధంగా గర్భిణీ స్త్రీల జాగ్ర పట్ల విషయాలు చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ వంశీకృష్ణ, ఆశా వర్కర్లు, ఏఎంఎం సిబ్బంది ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆడకూతురు పెండ్లికి అభిమన్యురెడ్డి ఆర్థిక చేయూత



పెండ్లి కూతురుకు నగదును అందజేస్తున్న అభిమన్యు యువసేన సభ్యులు

**మహబూబ్‌నగరన్ ప్రతినిధి, మే 31, ప్రభాతవార్త:** రాజాపూర్ మండలం నర్సింగ్ తండా గ్రామ పంచాయతీలోని ఇబ్రహీంపల్లి గ్రామానికి చెందిన స్వర్గీయ మల్లెపాగ రాములు కూతురు శిరీష వివాహానికి ఎంపీటీసీ, బీఆర్ఎస్ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం ప్రకటించారు. ఈమేరకు బుధవారం అభిమన్యు యువసేన సభ్యులు గ్రామానికి వెళ్లి పెండ్లి కూతురుకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా అన్నలా ఆదుకున్న అభిమన్యురెడ్డికి శిరీష కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలోజిల్లా ఉపసర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి మొగిలి మహిపాల్,వార్డు సభ్యులులక్ష్మయ్య,బాషమోని చెన్నయ్య, యాదయ్య గ్రామస్తులు జంగయ్య, నర్సింహులు,అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## పీపుల్స్ మార్చ్‌లో పాల్గొన్న వీపనగండ్ల మాజీ సర్పంచ్



పీపుల్స్ మార్చ్‌లో పాల్గొన్న వీపనగండ్ల మాజీ సర్పంచ్ గోదల బీరయ్య యాదవ్

**వీపనగండ్ల,మే31,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సీఎల్పీ లీడర్ అసెంబ్లీ టైగర్ మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ కొల్లాపూర్ నియోజకవర్గంలో అడుగుపెట్టిన సందర్భంగా 2వ రోజు పెద్దమండల కేంద్రం నుండి ప్రారంభమైన పాదయాత్రలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాపూర్ యువ నాయకులు రంగినేని అభిలాష్ రావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ వీపనగండ్ల మండల అధ్యక్షులు గోదల బీరయ్య యాదవ్ పాదయాత్రలో పాల్గొని భట్టి విక్రమార్కకు సంఘీభావం తెలిపారు.పాదయాత్రలో భాగంగా భట్టి విక్రమార్కతో కొల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ స్థితిగతుల గురించి కొల్లాపూర్ నియోజకవర్గం ఎప్పటికైనా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని తెలంగాణ రాష్ట్రంలో ఎలక్షన్లు ఎప్పుడు వచ్చినా మరోకసారి కొల్లాపూర్ కోటపై రంగినేని అభిలాష్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని తెలపారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యూత్ కాంగ్రెస్ నాయకులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సమీక్ష సమావేశం

**వీపనగండ్ల,మే31,ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యా లయంలో జూన్ 2వ తేదీ నుండి 22వ తేదీ వరకు జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఎంపీపీ కమలేశ్వర్‌రావు మాట్లాడుతూ...జూన్ 2వ తేదీ నుండి 22వ తేదీ వరకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో అన్ని డిపార్ట్‌మెంట్ శాఖలు పాల్గొన్నాయి. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కథాలప్ప, ఎంపీపీ కమలేశ్వంరావు, తహసీల్దార్ పాండు నాయక్,మండల ఎస్ఐరామన్‌గౌడ్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

